కథ 2011

12



# మూడు తొవ్వలు

బెజ్జారపు రవీందర్

రేపటి నుండి మొదలవుతున్న నిరవధిక బంద్ వల్ల కావచ్చు, బస్సులన్నీ కిక్కిరిసి పోతున్నాయి. ఖాళీ బస్సుకోసం గంటకు పైగా ఎదురుచూస్తూ ఉన్నాడు మధు. అతనికంతా చిరాకుగా, అసహనంగా ఉంది. సాధారణంగా ఎంతో ప్రశాంతంగా, సహనంగా ఉండే తాను ఎప్పటినుండి ఇలా తయారయ్యాడు... తర్కించుకుంటున్నాడు మధు.

'తనకు పై అధికారిగా కుమార్ వచ్చినప్పటి నుండి ఉద్యోగం అంటే విరక్తి మొదలయింది. అది తన జీవనపార్శ్వాలన్నింటిలోనూ రకరకాలుగా వ్యక్తమవుతోంది,' అనుకున్నాడు మధు.

ఈరోజు సెక్టోరియల్ అధికారుల సమావేశం జరిగింది. పెండింగ్ పనులపై సమీక్ష. ఆచరణసాధ్యం కాని టార్గెట్స్. చాలాసార్లు కామెడీగా ఉంటాయి ఆ స్కీమ్స్. తోటి అధికారులందరిని వదిలేసి తనను మాత్రమే లక్ష్యంగా చేసుకొని నానా మాటలూ అన్నాడు బాస్. పదిమంది ముందర అవమానించడం, హ్యుమిలియేట్ చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.

వివరణ ఇవ్వడానికి ప్రయత్నిస్తే- "ఓహో... యు ఆర్ ఎక్స్‌పెక్టింగ్ ఎ రివార్డ్. కావాలా నీకు? భారతరత్న ఇవ్వనా?" అంటూ వెటకారమాడాడు.

కోపం, జుగుప్సతో అతడికేసి చూస్తే, "నీకు పై అధికారితో మాట్లాడే పద్ధతి కూడా తెలియదు. యూ ఆర్ సో అరొగంట్..." తలెత్తి సూటిగా చూస్తూ, "భాషణ్‌తో దేతే... భాషణ్‌తో బహుత్ దేతే... నీలాంటి వాడికి పాత ఆఫీసరే బెటర్. నాతో కుదరదు..." అంటూ చిందులు తొక్కాడు.

అప్పుడర్థమయింది. కిందటి అధికారికి తను మరీ దగ్గరివాడినని, ఆంతరంగికుడనని అనుకుంటున్నాడు. దూరం పెట్టాలనే ఉద్దేశంతో అవమానిస్తున్నాడు. నిజానికి పాత ఆఫీసర్ కాలంలో ఆదివారాలు కూడా కుటుంబంతో గడపడం కుదిరేది కాదు. చాలా పనులు అప్పజెప్పేవాడు. కొంత ఇబ్బంది అనిపించినా అతను ఇచ్చే గౌరవం, చూపెట్టే అభిమానం వల్ల తృప్తి ఉండేది.

"హెడ్‌స్ట్రాంగ్ ఉన్నవాళ్లు ఎవరైనా ఉంటే... దే కెన్ గో ఆన్ లీవ్ ఆర్ ట్రాన్స్‌ఫర్..." తనకేసి అకారణమైన ద్వేషపు చూపులు చూస్తూ మీటింగ్ ముగించాడు.

'బుద్ధుడు నడయాడిన ప్రాంతం నుండి ఇట్లాంటి కర్కోటకుడు ఎలా పుట్టుకు వచ్చాడా?' అనుకున్నాడు మధు.

'రాజుల్ మత్తుల్, వారి సేవ నరకప్రాయంబు...' అంటూ నిరసించిన ధూర్జటి గుర్తుకు వచ్చాడు.

కసి, విరక్తి, దుఃఖం, అసహనం మధును చుట్టుముట్టాయి. 'పనికి గుర్తింపు లేదు. నిజాయితీకి గుర్తింపు లేదు. ఇట్లాంటి మనిషి దగ్గర పనిచేసే బదులు కూలిపని చేసుకుంటూ బతకడం ఉత్తమం. సెలవు లేదా బదిలీ...' అని నిశ్చయం చేసుకున్నాడు మధు.

కారును పంపించేసి, ఆఫీసు నుండి బస్టాండ్ వరకు నడుచుకుంటూ వచ్చాడు. చీకట్లు కమ్ముకుంటున్నాయి. నగరం ఫ్లోరోసెంట్, నియాన్ లైట్ల ఆభరణాల్ని ధరిస్తోంది. పనుల ఒత్తిడిలో, పరుగుపందెంలో పడి, దేన్నీ ఇంతకాలం గుర్తించలేకపోయాడు, ఆస్వాదించలేకపోయాడు.

తానెందుకు ఈ ఉద్యోగంలో ఇమడలేకపోతున్నాడు? హేతుబద్ధంగా ఉండని లక్ష్యాలుపెట్టి, సమీక్షల మీద సమీక్షలు పెడితే ఎవరికైనా విసుగురాదా? ఎమ్మెల్యేలు, ఎంపీల నియోజకవర్గాల వారీగా సమీక్షలు... జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి సమీక్షలు... అధికారుల దొంతరలో ప్రతి ఉన్నతాధికారికి ఏవో ప్రాధాన్యతలు... అధికారుల వారీగా సమీక్షలు... సమయమంతా వీడియో కాన్ఫరెన్సులు, సమీక్షలతోనే సరి!

ఒత్తిడి తట్టుకోలేకనో, క్రెడిట్ కొట్టేయ్యాలనే దురాశతోనో ఎక్కడో ఒకడు 'అతి ప్రగతి' చూపిస్తాడు. ఇక మొదలవుతాయి వేధింపులు. వారితో పోల్చడం మొదలుపెడతారు. ఓ రకంగా కాగితాల పై ప్రగతి చూపడానికి పరోక్ష ఒత్తిడి కలిగిస్తారు. ఒక స్థాయి ప్రగతి తరువాత లోపాలు, తప్పులు బయటపడడం మొదలవుతాయి. ఒకవైపు గిల్టీ ఫీలింగ్... మరోవైపు నియంత్రణ కోసం అస్త్రాలుగా విచారణలు... అధికార యంత్రాంగం కొయ్యగుర్రం కాదు. అదొక కాగితపు గాడిద! మధు మనసంతా చిరాకుతో నిండిపోయింది.

ఆలోచనలతో తలనొప్పి మొదలయింది. పండగ కోసం పుట్టింటికి వెళ్లిన అతడి భార్య వారం తరువాత వస్తానని ఫోన్ చేసి చెప్పింది. మనసంతా అదోలా ఉండటంతో ఉపశమనం కోసం తన స్నేహితుడు రవి ఉంటున్న కోరుట్లకు బయలు దేరాడు.

బస్టాండ్‌లో విపరీతమైన రద్దీ ఉంది. పదిగంటల తరువాత బస్సులుండవని ప్రయాణీకులకు సూచనలిస్తూ మైకు మోగుతోంది. టీవీల్లో అడ్వర్టయిజ్‌మెంట్ల గోల. వస్తూ పోతున్న బస్సుల హారన్ల చప్పుడు. బస్టాండు లాగే అతని మనస్సూ గందరగోళంగా ఉంది.

కోరుట్ల బస్సు వచ్చింది. ఎలాగో అలాగ కండక్టర్ వెనుక వైపు సీటు సంపాదించగలిగాడు మధు. సుమారు రెండు గంటల ప్రయాణం కరీంనగర్ దాటేసరికి బస్సు కిక్కిరిసిపోయింది.

ముందువైపు నుండి అందరినీ నెట్టుకుంటూ కండక్టర్ వస్తున్నాడు. లోకంలోని బంధుత్వాలన్నీ కలుపుతూ కదులుతున్నాడు. 'శిన్నాయి, పెద్దాయి, కాకా, తాతా, తమ్మి, అన్నా...' మధుకు మల్లన్న సిన్మాలోని పాట గుర్తుకు వచ్చింది. కండక్టర్ కేసి ఆసక్తిగా చూశాడు. నీట్‌గా కత్తిరించి రంగు వేసుకున్న మీసాలు, చిన్న కళ్లు, విశాలమైన నుదురు... కండక్టర్ సెలక్షన్‌లో ఏదో మాయ చేశాడనిపించే కురచరూపం.

మధు సీటు పక్క నుండి దాటిపోతూ కండక్టర్, "నమస్తే రెడ్డి సాబ్," అంటూ మధు పక్కన కూర్చున్న వ్యక్తిని పలకరించాడు.

అతను, "నమస్తే నర్సన్నా," అంటూనే, "నువ్వెప్పుడు రెడ్డిసాబ్ అంటవో, ఎప్పుడు ముడ్డిమీద తంతవో తెలవది కద నర్సన్న... అంతా యూనియన్ లీడర్ల రాజ్యం..." అన్నాడు.

"నిన్నని బతుకుతనా అన్నా..." అంటూ, "టికెట్... టికెట్," అని అరుస్తూ చురుకుగా తన పని తను చేసుకుంటున్నాడు కండక్టర్.

కాషాయరంగు బట్టల్లో ఉన్న సాధువు ఒకాయన మధు సీటు పక్కన నిలబడ్డాడు. అతన్ని చూస్తే ఎక్కడో చూసినట్లనిపించింది. సాధువులతో తనకు పరిచయం లేదే! గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు.

"ఇరవై రూపాయలిస్తే టిక్కెట్టెనుక రాయక పోతివి. రెండు రూపాయలియ్యక పోతివి..." అంటోంది ఓ ముసలావిడ.

"ఓ శిన్నాయీ, టీవీలల్ల ఊకే సిన్మాలు సీరియల్లు చూసుడేనా?! అప్పుడప్పుడు బస్సు కిరాయిలు పెంచిన ముచ్చట్లు చూపెడతరు. గవ్విగూడా సూడాలే," అంటూ పరాచికమాడాడు కండక్టర్.

చుట్టుపక్కల వాళ్లంతా నవ్వారు. అంత రష్ లోనూ కొంత చల్లదనం వచ్చినట్లు అనిపించింది.

నల్లగా కుదిమట్రంగా ఉండి తెల్లటి ఖద్దరు అంగి తొడుక్కున్న అతనికి మాత్రం మంటగా ఉంది. ముఖ్యంగా తానంతటివాడు నిలబడాల్సి వచ్చినందుకు.

కిందికి జారుతున్న బంగారు బ్రాస్‌లెట్‌ను సవరించుకుంటూ, "ఈళ్లు జీతాలు పెంచుకున్నరు. మనకేమో బస్సు కిరాయిలు పెంచిన్రు," అన్నాడు ఖద్దరు అంగి.

"అవును... డ్యూటీ అయిపోయినంక కరీంనగర్‌ల సర్కస్ గ్రౌండ్ కొనవోతున్నా సేఠూ... నిన్న క్లాక్ టవర్ కొన్నా..." అన్నాడు కండక్టర్ వ్యంగ్యంగా.

ఖద్దరు అంగీ అతను ముఖం ముటముటలాడిస్తూ, "నేను సేఠ్‌ని కాదు ఎంపీటీసీని..." అన్నాడు.

"అట్లనా, సారీ అన్నా..." అన్నాడు కండక్టర్. కానీ సారీ చెప్పడంలో అతను చూపిన చమత్కారానికి నవ్వొచ్చింది మధుకు.

వృత్తి జీవితంలోని అధిక కాలాన్ని మింగేస్తుంటే పనిలోనే రిలాక్సేషన్ వెతుక్కోవలసి వస్తోంది. ఆఫీసులోని మనుషుల్తో ట్యూన్ అవుతూ కొంత నవ్వుని, కొంత ప్రశాంతతని పెంచుకుంటూ వస్తున్న తరుణంలో మహామానవ సునామీగా వచ్చాడు కొత్త అధికారి కుమార్.

తనతో క్లోజ్‌గా ఉండే రాజమౌళిని శాడిస్టిక్ మొగుడి కంటే హీనంగా వేపుకు తిన్నాడు కుమార్. విసిగిపోయిన రాజమౌళి ఒకసారి తనతో-

"మన పాపాలకు మనల్ని ఇహలోకంలోనే శిక్షించడానికి భగవంతుడు పంపిన యమదూత ఇతడు..." అన్నాడు.

తాను ఓ స్థాయి అధికారి అయినందుకు తన కుటుంబం, బంధువులు, మిత్రులు అందరూ... అది తమ విజయమే అని మురిసిపోయారు. వాళ్లందరి మాటలు గుర్తుకు వచ్చాయి ఇప్పుడు మధుకు.

అధికారిగా రాణించాలంటే ఉండవలసినవి రెండే లక్షణాలని... ఒకటి- పైవాళ్ల కాళ్లు నాకడానికి వెనుదీయని శ్రేష్ఠమైన బానిసత్వ గుణం. రెండు- కిందివాళ్ల ఎముకలు విరిచేసి నంజుకు తినగల కర్కశరాక్షస యాజమాన్య వైఖరి అని త్వరలోనే తెలిసిపోయింది మధుకు.

ఉద్యోగం చుట్టూ గిరిగీసి ఉంటుంది. వలయాలు, వలయాలుగా వుంటుంది. బిగుస్తూ వదులుతూ ఉన్న సంకెళ్ల మధ్య ఒక్కోసారి కొంత బుద్ధి ఉపయోగించగల, మంచి చేయగల అవకాశం వుంటుంది. కానీ చాలాసార్లు సృజనాత్మకతకు, మేలు చేయడానికి అవకాశం ఉండదు. పాపపుణ్యాలు పట్టని ఫక్తు యంత్రం మాదిరిగా పనిచేస్తూ పైవాడి అహాన్ని సంతృప్తిపరచగలగడమే ఉద్యోగ ధర్మమై కూర్చుంటుంది.

భరించలేక ఎదురుతిరిగిన వెంకటేశ్ పరిస్థితి గుర్తొచ్చి నిట్టూర్చాడు మధు. ఫిర్యాదు చేసినందుకు అక్కసుతో మరునాడే వెంకటేశ్ పై ఎసిబి దాడులు చేయించాడు కుమార్. అయితే ఆస్తుల కంటే అప్పులు ఎక్కువ ఉన్నాయనే నిజం బయటపడింది. అత్యంత పలుకుబడిగల కుమార్ ఒత్తిడి వల్ల డిపార్ట్‌మెంట్ అధికారులు వెంకటేశ్‌ను నానా విధాలుగా సతాయించి, సస్పెండ్ చేసి అనేక ఆరోపణలు అతని తలకు చుట్టారు. వాటన్నింటి నుండి నిర్దోషిగా బయటపడాలంటే చాలా టైం పడుతుంది.

టిక్కెట్లివ్వడం సగం పూర్తయింది. మధు మానసిక పరిస్థితిని తలనొప్పి మరింత దిగజారుస్తోంది. నోటు బుక్కును విలాసంగా పట్టుకొన్న కాలేజి పిలగాడొకడు కండక్టర్‌ను ఉద్దేశించి-

"మీ డ్రైవర్ సాబ్ ఇంతకుముందు కచ్చురం నడిపేటోడా? మస్తు మెల్లగ తోల్తున్నడు బస్సును," అంటూ వెటకారమాడాడు.

దానికి కండక్టర్, డ్రైవర్ ఉన్న వైపు మొహం పెట్టి గొంతెత్తి, "ఓ డ్రైవర్ రాములన్నా... జగిత్యాల చేరేసరికి తెలంగాణ వచ్చేటట్లున్నదే!" అంటూ అరిచాడు. మళ్లీ అందరి ముఖాల్లో నవ్వు.

కండక్టర్ తెలంగాణ ప్రసక్తి తెచ్చేసరికి అందరికీ ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది.

"తెలంగాణ వచ్చినంకనన్నా బస్సు కిరాయిలు తగ్గిస్తరా?" అడిగాడు సాదాసీదాగా టక్ చేసుకున్న గడ్డం యువకుడు.

అందుకు కండక్టర్, "హే... ఎందుకు తగ్గించం? తెలంగాణ రాష్ట్రంల బస్సులు నీళ్లతోటే నడుస్తయ్ కదా... అయినా ఇంకెక్కడి తెలంగాణ? ఆడకాడక సమర్తాడితే చాకలాయన కోకెత్తుకపోయిండట. చిదంబరం తెలంగాణ అన్నడో లేదో ఇద్దరు పెండ్లాల మధ్య ఇరుకునపడి సచ్చినట్లాయె కేంద్రం పరిస్థితి," అన్నాడు.

టికెట్లివ్వడం ముగింపుదశకు వచ్చేసింది. చల్లగాలికి మనసు కొంత తెరిపిన పడ్డట్లయింది మధుకు.

బహుశా రెండు మూడు రోజుల్లో అమావాస్య ఉన్నట్లుంది. చంద్రుడు రేఖా మాత్రంగా కనిపిస్తున్నాడు. చీకట్లోంచి ఊర్లను గుర్తుపట్టడానికి ప్రయత్నించసాగాడు. తనని బాధపెట్టగల మొనగాడే లేడన్నట్లు కండక్టర్ హుషారుగా పని పూర్తి చేసుకొని వచ్చి కూర్చున్నాడు. 'యస్సార్' రాయడం పూర్తిచేసి నోట్లు లెక్క పెట్టుకుంటున్నాడు. నోరు మాత్రం ఏదో మాట్లాడుతూనే ఉంది.

"అయ్యోరి గుర్రానికి అన్నీ అపశకునాలే అన్నట్లు అడుక్కొక్క ఆపద," అన్నాడు కండక్టర్. పక్కన కూర్చున్న ముసలాయన రిటైరైన మనిషిలాగా ఉన్నాడు.

"మనండ్లనే ఒకరేమో హైద్రాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతమనవట్టిరి. ప్రత్యేక రాష్ట్రమనవట్టిరి..." అభిప్రాయ భేదాల జాబితా చదువుతున్నాడు గడ్డం మనిషి.

"వెనుకటికి ఎవడో అన్నాడు, గుగ్గిలం వెయ్యక పోతే పోయావుగానీ, గుళ్లో పిత్తొద్దు అని..." కండక్టర్ నోట్లు లెక్కపెట్టుకుంటూ అన్నాడు.

మళ్లీ అందరూ నవ్వారు.

జగిత్యాల వచ్చింది. కండక్టర్ బస్సు దిగి కంట్రోలర్ దగ్గరికి వెళ్లాడు. 'అతన్ని చూస్తే 'ఉద్యోగం చేయడం ఇంత తేలికా అనిపించేట్లుంది,' అనుకున్నాడు మధు.

రెడ్డి పక్కన ఇరికి కూర్చున్నాడు గడ్డం వ్యక్తి.

మధుకు అసౌకర్యం అనిపించింది.

"కండక్టర్ భలే జోరుగా ఉన్నాడు," అన్నాడు గడ్డం వ్యక్తి.

"తెలుగు సినిమా కష్టాలన్నీ ఆయనకూ వున్నాయి. అప్పులు, ఆడపిల్లలు, రోగాలు... వగైరా.

ఈయన ఎప్పుడో కంట్రోలర్ కావల్సినోడు. నోటి తీట ఎక్కువ. మొన్నటికి మొన్న సూపర్‌వైజర్‌ను ఏదో గెలికితే ఆయనకు కోపమొచ్చి నా కాళ్లు పట్టుకునేట్టు చేస్తానని అన్నడు. అందుకు ఈ కండక్టర్ నర్సిగాడు ఏమన్నడో తెలుసా... ముందు శుభ్రంగా సాక్సు ఉతుక్కో... అప్పుడు చూద్దాం అన్నాడు.''

అంటూ ఇంకా ఏవో ఏవో సంఘటనలు చెప్పాడు రెడ్డి.

కండక్టర్ తిరిగి రావడంతో బస్సులోకి కొత్త కళ వచ్చినట్లనిపించింది.

జగిత్యాల ఊరు చివరకు వచ్చేస్తుంటే చేతిలో పసిపిల్లతో ఉన్న ఒకామె ఆపింది. హడావిడిగా బస్సు ఎక్కింది ఆమె. జుట్టు, బట్టలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఆమె ఎక్కిందో లేదో ఒకతను పరిగెత్తుకుంటూ వచ్చి తిడుతూ బస్సు ఎక్కి ఆమెను కిందికి లాగడానికి ప్రయత్నించసాగాడు.

బస్సులోని వారంతా ఆ జంటనే చూస్తున్నారు.

''అయ్యో, పసిపిల్ల పడిపోతదయ్యా...''

''ఏమ్మనిషివయ్యా, ఆడపిల్లను గట్ల గుంజవడ్తివి. సైసరాదు...'' బస్సు తలుపు వద్ద ఉన్నవారు తలో మాట అంటున్నారు. భార్యాభర్తలిద్దరు గొడవపడుతున్నారని, ఆమె పుట్టింటికి వెళ్లడానికి బస్సెక్కిందని అందరికీ అర్థ మయింది. కిందికి లాగడానికి భర్త ప్రయత్నించడము, భార్య బస్సు లోపలికి వెళ్లడానికి గింజుకుంటుండడంతో అందరి దృష్టి వారిమీదనే ఉంది.

అంత గొడవలోను కండక్టర్ వాళ్లను టికెట్ అడగడం మానలేదు. ఆమె జాకెట్లోంచి పర్సు తీసి డబ్బులిచ్చింది.

''గీ రాత్రిపూట ఏం పోతవమ్మ. ఇంటికెళ్లి పోరాదు...'' అంది ఓ ముసలావిడ.

ఆమె ఇచ్చిన డబ్బులు చేతిలో పట్టుకొని నీ సంగ తేంటని మొగుడి వైపు చూశాడు కండక్టర్.

''బస్సు ఆపున్రి. టిక్కెట్టు కొట్టకున్రి సారు. దిగి పోతాం,'' అన్నాడతను కోపంగా మొసపోస్తూ.

''బస్సు పోనియ్యున్రి సారు. నా టిక్కెట్టు నా కియ్యున్రి,'' అందామె ఆయాసపడుతూ.

కండక్టర్ రెండు టికెట్లు కట్‌చేసి మిగిలిన చిల్లర ఆమె చేతిలో పెట్టాడు. ఆమె కండక్టర్ వైపు గుడ్లురిమి చూసింది.

''ఎక్కడో లేకిదాన్ని తీసుకచ్చి నా మెడకు గట్టిన్రు. లగ్గంలనే తెలిసె నీ ఇంటి పీస్కపు బుద్ధి...'' మాటలు బూతుల్లోకి దిగాయి.

అందరి చెవులు పగిలిపోతున్నట్లనిపించాయి.

''ఏంది పిలగా మోటు మాటలు. ఏమన్న అంటే ఇంట్లో అనుకోన్రిగాని, గిక్కడ్నా? సూత్తె చదువుకున్నోని లెక్క ఉన్నవ్...'' అంటూ మందలించింది మెరుపుల్తో బాలనాగమ్మ రంగు చీర కట్టుకున్న ఓ మధ్య వయస్సు స్త్రీ.

చంకలో పిల్లతో ఉన్న ఆమె ఏమీ మాట్లాడలేదు. కొంత స్థిమితపడింది. ఆమె కళ్లలో అవమానం, దుఃఖం ముప్పిరిగొని ఉన్నాయి. చంకలోని పిల్ల భయంతో మధ్య మధ్యలో ఏడుస్తూ, కాస్సేపు నీరసంగా తలవాల్చి తల్లి భుజాన్ని హత్తుకొని ఉంది.

''ఇటున్న పుల్ల అటు పెట్టుడు చాతకాదుగానీ, కండ్లు నడినెత్తిమీది కెక్కి నయ్...'' అంటూ మళ్లీ చేయి ఎత్తబోయి ఊరుకున్నాడు.

గుడ్లురిమి చూడ్డం, పండ్లు కొరకడం, అరవడం చూస్తే చప్పున మధుకు తన పై అధికారి కుమార్ గుర్తుకు వచ్చాడు. నోరు తెరిస్తే సస్పెండ్ అంటాడు. భయంతో, భక్తితో చచ్చిచెడి డ్యూటీలు చేస్తే మంచి పర్ఫామెన్స్ చూపిస్తే... దాన్ని పైవాళ్లందరి ముందర తన క్రెడిట్‌లాగా చూపెడతాడు. ప్రశంసలు పొందుతాడు. కాని అతన్నుండి ఒక్కసారి కూడా 'గుడ్' అనే కనీస ప్రశంస కూడా ఎవ్వరూ నోచుకోలేకపోయారు. కొంత తక్కువ పని జరిగినా, ఏవైనా ప్రతిబంధకాలు వచ్చినా అది మా అసమర్థతగా చూపెడతాడు. బూతులు తిడతాడు. కాకపోతే ఇంగ్లీషులో.

''పచ్చిపులుసు చేసుటానికి పదారు దీర్ఘాలు తీసే ముండను బొందల పెట్టి తీసినా తక్కువనే...'' మొగుడి పురాణం ఆగడం లేదు.

''అ... ఆడోళ్లు చెయ్యపోతెనే మొగోళ్ల చెత్తలు (పొట్టలు) పెరుగుతున్నాయి...'' అంది బాలనాగమ్మ రంగు చీరామె. అతని ఎత్తయిన బొర్రను పట్టిపట్టి చూస్తూ.

''నీకేం తెలుసని మధ్యల ఊకే అడ్డమొస్తు న్నవ్...?'' అంటూ బాలనాగమ్మ రంగు చీర వైపు ఉరు ముతూ అన్నాడు.

''నప్పతట్ల ముండకు రేషం బాగా... నీ అయ్య సొమ్మా, అవ్వ సొమ్మా... సంపాయించుకొస్త... తాగుతా. నీ తల్లిగారు పెట్టిన బంగారు కడ్డీలు కరిగించి తింటే తాగుతే చెప్పుదీసి కొట్టు. అవును... ఎల్లిపొమ్మని అన్న. నన్ను నూకేసి ఉరికితే... నేను నాదాను ఉన్న అనుకున్న వానే...'' ఆయాసంతో అతని మాటలు తడబడు తున్నాయి.

ఆమెవంక చూశాడు మధు. అపరిచితులైన మంది ముందు మాటలు పడుతున్నందుకు కలుగుతున్న బాధ, అవమానంతో ఆమె మొహం కమిలిపోయింది. పెదవులు వణుకుతున్నాయి. ఒక్కమాట పెదవి దాటి బయటకు రాలేకపోతోంది.

బాస్ కూడా అందరి ముందు అవమానిస్తాడు. వీళ్లకు ట్రైనింగ్‌లో ఏమి నేర్పుతారో అర్థంకాదు. తాము పర్యవేక్షించాల్సింది మనుషుల్ని చెప్పరు కావచ్చు. ఒక అమానవీయ దృక్పథాన్ని నూరిపోస్తారనుకుంటా. కనీసం చెడ్డవాళ్ల పట్ల చెడ్డగాను, మంచివాళ్ల పట్ల మంచి గాను ఉండడం కూడా ఎందుకు తెలియదు వీళ్లకు? సున్నిత మనస్కుల్ని మాటతోను, ఓ మోస్తరువాళ్లని మందలింపుతోను, దళసరి చర్మం వాళ్లని చర్యతోను మార్చవచ్చని గ్రహించరు.

కొంతసేపు యుద్ధవిరమణ ప్రకటించినట్లున్నాడు మొగుడు.

టక్ చేసుకున్న మనిషి కండక్టర్‌తో, "ఏంది సారూ! ఒక్కమాట మాట్లాడత లేవు..." అన్నాడు, అతను ఏదన్న జోక్ వేస్తే బాగుండన్న ఆశతో.

"ఇంటింటికో మట్టిపొయ్యి... పెండ్లాం మొగుళ్ల గూసులాట అందరి ఇండ్లల్ల ఉన్నదేనాయె... నా తల చూస్తే తెలుస్త లేదా!" అన్నాడు బట్టతల చూపిస్తూ కండక్టర్.

మధు సాధువు వైపు చూశాడు. అతడు ఆ అమ్మాయి వంకే నిశ్చలంగా చూస్తున్నాడు. మనసులో ఏ మూలో ఆర్ద్రత కదిలినట్టుంది. బహుశా ఆమె కోసం ప్రార్థిస్తున్నాడేమో!

మధుకు అకస్మాత్తుగా గుర్తొచ్చింది. ఆ సాధువు పేరు రమాపతి. తన ఊరివాడే. చాలా సంవత్సరాల క్రితం చూశాడు. మళ్లీ ఇప్పుడు. ఇంట్లో తండ్రితో, భార్యతో గొడవలైతే సర్ది చెప్పలేక సతమతమయ్యేవాడు. ఓరోజు చెప్పాపెట్టకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. గడ్డం మీసాలు అతని ఆచూకీని కప్పిపెట్టాయి. పలకరిద్దామా అనుకున్నాడు. కాని ఊరుకుండిపోయాడు. సాధువు మధువైపు నిర్వికారంగా చూశాడు. ఆ కళ్లలో ఏ భావమూ లేదు.

ఆమె చంకలోని పిల్లను లాక్కోబోయాడు మొగుడు. ఆమె ఆ పిల్లని అలానే గట్టిగా పట్టుకుని పక్కకు జరిగింది.

"తాపతాపకు తల్లిగారింటికి పోతానని ఎగుర్తవెందుకే. నీ మిండెడు పిల్సిండానే. ఎగేసుకుంట పోతున్నవ్. చెటాక్ మాంసం లేదుగాని మిండెడు కావాల్సి వచ్చిండానే..." అతని మాటలు పూర్తయ్యాయో లేదో-

అప్పటిదాకా మూగదానిలా ఉన్న ఆమె పిల్లను చంకలో గట్టిగా పట్టుకొనే కళ్లు పెద్దవి చేసి, పండ్లు కొరుకుతూ, గట్టిగా అరుస్తూ మొగుని జుట్టు పట్టుకొని అటూ ఇటూ ఊపింది. అతను ఎంత గింజుకుంటున్నా వదల్లేదు.

చుట్టుపక్కల వాళ్లు విడదీయాలని ప్రయత్నిస్తున్నారు. ఆమె నుండి అట్లాంటి ప్రతిక్రియ మొగుడు ఊహించి ఉండడు. షాక్‌తోనూ, నొప్పితోనూ గింజుకుంటున్నాడు.

ఆమె తిరగబడడం, అరుపులు, కేకలు మధుకు అయోమయంగా అనిపించాయి.

అంత బలిష్టమైన మొగుడు సైతం... జుట్టు పట్టి ఊపుతుంటే నొప్పితోని, అవమానంతోని అరుస్తూ మొత్తంగా కదిలిపోతున్నాడు తప్ప ఎదురుతిరగలేక పోతున్నాడు.

ఆమె పిడికిలి... పిడికిట్లోని జుట్టు... జుట్టు కింద బాధతో మెలితిరిగిపోతున్న మొగుడి తల చూస్తుంటే కాళికాదేవి గుర్తుకు వచ్చింది మధుకు. బస్సెక్కిన తర్వాత మొదటిసారిగా ఎంతో మనోహరంగా కనిపించిందామె! నవ్వుతున్న కండక్టర్, నిర్వికారంగా ఉన్న సాధువు, ఉగ్రరూపమెత్తిన స్త్రీ... ముగ్గురూ రీళ్లలాగా గిర్రున తిరుగుతున్నారు మధు ఆలోచనల్లో...

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 23 అక్టోబర్, 2011*

